తెలంగాణ ప్రభుత్వం

**పౌరసరఫరాల శాఖ కార్యాలయం**

సోమాజిగూడ, హైదరాబాద్ - 500082

పత్రిక ప్రకటన : తేదీ : **04-02-2019**

# వచ్చే ఏడాదికి యాక్షన్ ప్లాన్

# పౌరసరఫరాల శాఖ అధికారులకు శిక్షణా తరగతులు

పౌరసరఫరాల శాఖకు సంబంధించి రాబోయే ఏడాదికి, ముఖ్యంగా ధాన్యం కొనుగోలుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించుకునేలా ఆ శాఖ ఉద్యోగులకు శిక్షణా తరగతులను నిర్వహించింది. కేంద్ర కార్యాలయంలో పనిచేసే అధికారులతో పాటు జిల్లా స్థాయిలో పనిచేసే డీసీఎస్ఓ, ఏసీఎస్ఓ, జిల్లా మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లకు సోమవారం నాడు ఎంసీఆర్ఐఎచ్ఆర్డీలో ఒక రోజు శిక్షణా తరగతులను నిర్వహించింది. ఈ తరగతులను పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్ ప్రారంభించారు.

నిర్ణీత కాలంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలంటే పౌరసరఫరాల శాఖను పునరుత్తేజితం చేయాల్సిన అవసరం ఉందని, దానికి అనుగుణంగా అధికారులకు పునశ్చరణ, శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందని ఆ శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్ అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులతో పాటు రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు వంటి రైతు సంక్షేమ చర్యలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగి ఏటేటా ధాన్యం దిగుబడి పెరుగుతోంది. వచ్చే ఏడాది కాలంలో రానున్న రబీ, ఖరీఫ్ సీజన్లో పౌరసరఫరాల శాఖ రైతుల నుండి భారీగా ధాన్యం కొనుగోలు చేయవలసిన అవసరం ఏర్పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన చర్యలపై అధికారులు ఇప్పటి నుంచే దృష్టి సారించి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

గత ఏడాది ఖరీఫ్, రబీ రెండూ సీజన్లో కలిపి 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఒక ఖరీఫ్లోనే ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించింది.

పెరుగుతున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు ప్రణాళికలను రూపొందించుకుని, రైతులకు కనీస మద్దతు ధర అందించడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించే పనిలో పౌరసరఫరాల శాఖ నిమగ్నమైంది. ఇందులో భాగంగా బిజినెస్ విభాగాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తోంది.

అలాగే ప్రజాపంపిణీలో అక్రమాలను నిరోధించి, అర్హులకే నిత్యావసర సరుకులు అందేలా ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానంతో అనేక చర్యలు చేపట్టింది. వీటిని మరింత పటిష్ట, విస్తృతపరిచే దిశగా ముందుకు సాగుతోంది.

ధాన్య సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్, గోదాముల్లో బియ్యం నాణ్యత, ధాన్య సేకరణలో గన్నీ సంచుల వినియోగం, ఆర్థికంగా రాష్ట్రంపై భారం పడకుండా నిర్దేశిత సమయంలో రేషన్ బియ్యం రవాణా, పంపిణీపై, ఇతర ఆర్థికపరమైన అంశాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ విభాగం నిఘాపై, సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తగా ప్రవేశపెట్టిన విధానాలు, ధాన్యం చెల్లింపులకు సంబంధించి ఓపీఎంఎస్ సాఫ్ట్‌వేర్ వంటి అంశాలపై అధికారులకు ఒకరోజు శిక్షణ ఇవ్వడం జరిగింది.

నోట్: 1) ఎంసీఆర్‌ఐఎచ్‌ఆర్‌డీలో ఒక రోజు శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్.

2) ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులకు శిక్షణ ఇస్తున్న ఆ శాఖ చీఫ్ కల్నల్ ఎం.ఎస్. ప్రకాశ్.

---

పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి జారీచేయబడినది.